క్లుప్తంగా

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



ఆముదం సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శుభకర్

కూడేరు: వేరుశనగ, టమాట, కంది, బత్తాయి పంటలకు జూలై 15 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి శుభకర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మరుట్ల–1 కాలనీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల బీమా చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆముదం సాగు, పంటకు సోకే తెగుళ్లు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతిలో పంటలు సాగు చేస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

ఆశావర్కర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ



నోటిఫికేషన్ చూపుతున్న డాక్టర్ ఉషారాణి

కూడేరు: అర్హత ఉన్నవారు ఈనెల 30లోపు ఆశావర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల వైద్యాధికారిణి ఉషారాణి సూచించారు. బుధవారం కూడేరు పీహెచ్‌సీలో ఆశావర్కర్ల ఖాళీ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను వైద్యాధికారులు అతికించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి మాట్లాడుతూ.. కూడేరు–1 సచివాలయం, గొటుకూరు సచివాలయం పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఆశావర్కర్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉన్న వారు అర్హులన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర పాల్గొన్నారు.

కూలీలకు పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం ముద్దలాపురంలో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న కాలువల్లో పూడికతీత(ఫీడర్ చానల్ కెనాల్) పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పనులు సక్రమంగా కల్పిస్తున్నారా.. బిల్లులు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య,టెక్నికల్ మంజునాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచండి

కణేకల్లు: కేజీబీవీల్లో సీట్ల సంఖ్య పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ డిమాండ్ చేశారు. కేజీబీవీలో సీట్ల సంఖ్యను పెంచడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి బుధవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీట్ల సంఖ్య పెంచాలన్నారు. సీఈసీ ఒక్కటే కాకుండా ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ గ్రూపులను కొనసాగించాలని కోరారు. చాలా చోట్ల తరగతి గదులు, మరుగుదొడ్లు, డార్మెటరీ సమస్యలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.


ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్: ఎమ్మార్పీఎస్ బొమ్మనహాళ్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావ్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ మాదిగ తెలిపారు. బుధవారం బొమ్మనహాళ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శ్రీధరఘట్ట చంద్రమాదిగ, గౌరవ అధ్యక్షులుగా దర్గాహొన్నూరు వన్నూరుస్వామి, ఉపాధ్యాక్షులుగా కొలగానహళ్లి ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా బండూరు శివరామ్ మాదిగ, కార్యదర్శిగా ఉప్పరహాళ్ రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు.


30న బియ్యం, బేడల వేలం

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని పెన్న హోబిలం నృసింహస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను ఈనెల 30వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

సమాచారం.. అపహాస్యం



రాయదుర్గం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద 15 ఏళ్ల క్రితం పనిచేసిన అధికారులతో సమాచార బోర్డు



శాఖల వారీగా కొన్ని పేర్లు లేని, బదిలీ అయిన టీపీఎస్ పేరుతో మున్సిపల్ కార్యాలయంలోని బోర్డు



తహసీల్దార్ కార్యాలయంలో పాత ఆర్డీఓ, ఇతర అధికారుల పేర్లు కన్పించకుండా పోస్టరును అతికించిన దృశ్యం

రాయదుర్గం టౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డుల్లో పాత సమాచారం దర్శనమిస్తోంది. ప్రజలు ఏదైనా సమాచారం గురించి తెలుసుకోవాలనుకుంటే ఎవరిని సంప్రదించాలో వివరిస్తూ కార్యాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. విభాగాల వారీగా సమాచార, సహాయ సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారుల పేర్లు బోర్డుల్లో పొందుపరచాలి. అయితే రాయదుర్గంలోని పురపాలక సంఘం, తహసీల్దార్, విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో నేటికీ పాత సమాచారమే కనిపిస్తోంది. సమాచార, సహాయ సమాచార అధికారుల స్థానంలో ఎవరైనా కొత్తగా వస్తే ఎప్పటికప్పుడు బోర్డులో పేర్లను నవీకరించాలి. కానీ కొన్ని కార్యాలయాల్లో సమాచార బోర్డుల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సమాచార బోర్డులో అయితే దాదాపు 15 ఏళ్ల క్రితం పనిచేసిన అధికారుల పేర్లు నేటికీ దర్శనమిస్తుండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డుల్లో పేర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వు స్థలాల్లో ఆక్రమణలపై కొరడా



జేసీబీని అడ్డుకుంటున్న లబ్ధిదారులు

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు గౌడ ఇందిరమ్మ లేవుట్‌లోని రిజర్వ్ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. బేస్‌మట్టాలను జేసీబీతో తొలగించేందుకు బుధవారం అధికారులు చర్యలు చేపట్టారు. ఒక బేస్‌మట్టం తొలగించి.. తదుపరి వాటిని తొలగించేందుకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న నిర్మాణదారులు అక్కడికి చేరుకుని జేసీబీని అడ్డుకుని నిరసన తెలియజేశారు. తమకు గూడు లేదని, బాడుగ ఇళ్లలో ఉన్నామని, గతంలో బేస్‌మట్టాలు వేసుకున్నామన్నారు. కొందరికి పట్టాలు లేకపోవడంతో నిర్మించేందుకు ఆలస్యమైందన్నారు. పట్టాలు, పక్కాగృహ నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా హౌసింగ్ లేఅవుట్లలోని రిజర్వు స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ఇల్లు లేని వారు ఇంటి స్థలాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేఅవుట్లలో ఇటీవల నోటీసులు జారీ చేసిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించుకోకపోతే స్థలం రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎస్‌ఎస్ ట్యాంకులో 1,482 మిలియన్ లీటర్ల నీటి నిల్వ



ఎస్‌ఎస్ ట్యాంకులో ఉన్న నీరు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత మంచినీటి పథకం కింద తాగునీటిని అందజేస్తున్న కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో బుధవారం నాటికి 1,482 మిలియన్ లీటర్ల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి మట్టం 3,052 మిలియన్ లీటర్లు కాగా.. ప్రస్తుతం నిల్వ ఉన్న 1,482 మిలియన్ల నీటిని మరో 156 రోజుల దాకా పట్టణానికి సరఫరా చేసే అవకాశం ఉంది. మూడు రోజులకోసారి నీటిని అందిస్తుండడంతో ఈసారి నీటి నిల్వ అధికంగా ఉంది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాంకు ఇప్పటికే 50 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో గడువుకంటే ముందుగానే హెచ్చెల్సీకి నీరు వదిలితే ఎస్‌ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇదిలావుండగా నీటి నిల్వ అధికంగా ఉండడం, గడువుకంటే ముందుగానే హెచ్చెల్సీకి నీరు వదిలే అవకాశం ఉండడంతో పట్టణంలో రెండు రోజులకోసారైనా నీటిని వదలాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కుందుర్పి మండలానికి సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో యువజన విభాగం మండలాధ్యక్షుడిగా అంజిన్‌రెడ్డి, మహిళా విభాగం రాజేశ్వరి, రైతు విభాగం మంజునాథ్, బీసీ సెల్ హనుమప్ప, ఎస్సీ సెల్ కుందుర్పి హనుమేష్, ఎస్టీ సెల్ నారాయణనాయక్, మైనార్టీ సెల్ రసీద్, క్రిస్టియన్ మైనార్టీ రాజేష్, స్టూడెంట్ వింగ్ మహదేవ, పంచాయతీరాజ్ వీరేష్ యాదవ్, మున్సిపల్ వింగ్ ఈ.రాము, ఆర్‌టీఐ ఆనంద్, వలంటీర్ విభాగం ఆంజనేయులు, వాణిజ్య విభాగం వీ.అంజి, వీవర్స్ వింగ్ ఎన్. ఓబుళేసు, వైఎస్సార్‌టీయూసీ గోసప్ప, పబ్లిసిటీ వింగ్ బోయ ఓబుళేసు, దివ్యాంగుల విభాగం తిమ్మరాజు, సోషల్ మీడియా యూ.రాజు, అంగన్‌వాడీ వింగ్ బీ లక్ష్మి, కల్చరల్ వింగ్ సుధాకర్ నియమతులయ్యారు. ఈసందర్భంగా వారు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరభద్ర స్వామికి అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

బొమ్మనహాళ్: మండల కేంద్రం బొమ్మనహాళ్‌లోని వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమంలు, ఆకుపూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎత్తున పాల్గొన్ని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగంణంలో అన్నదానం చేశారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు బుధవారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఆర్డీటీ లక్ష్యం



మహిళలకు పొదుపు బాండ్లు అందజేస్తున్న డైరెక్టర్ విశా ఫెర్రర్

శెట్టూరు: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఆర్డీటీ లక్ష్యమని సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశా ఫెర్రర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అనంతరం ఉజ్వల మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ (మహిళ సంఘం బ్యాంక్)ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బయటి అధిక వడ్డీకి రుణాలు తీసుకొని ఇబ్బంది పడుతున్నారన్నారు. మహిళలు తమ పొదుపును ఉజ్వల మహిళ కోఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్లు చేసి తమకు అవసరం మేరకు అతి తక్కువ వడ్డీకు రుణాలు పొందవచ్చన్నారు. ఉజ్వల మహిళ బ్యాంక్ సిబ్బంది ఇంటి వద్దే సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నిరంజన్, రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటీఎల్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెఎస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు తిప్పేస్వామి, నాయకులు లింగప్ప, కైరేవు శ్రీరాములు, ఈరన్న, బాబురావు, మహిళలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ బిల్లులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ, కౌలు రైతు సంఘం నాయకులు

ఉరవకొండ రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తూ నెలల తరబడి కూలీల బిల్లులు పెండింగ్‌లో ఉంచడం భావ్యం కాదన్నారు. మండలంలోని ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. జాబ్ కార్డుకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురళి, వీరాంజనేయులు, రవి, సిద్దప్ప, నాయకులు సుంకన్న, ఎర్రిస్వామి, లక్ష్మన్న, రామాంజనేయులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి

కల్యాణదుర్గం రూరల్: విత్తన శుద్ధితో అధిక దిగుబడి పొందవచ్చని ఏఓ శ్రావణ్‌కుమార్ తెలియజేశారు. బుధవారం నారాయణపురం, బోయలపల్లి గ్రామంలో ‘పొలం పిలుస్తోంది’ నిర్వహించారు. ఏఓ రైతులకు విత్తన శుద్ధి విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. ఒక కేజీ విత్తనానికి క్లోరిఫై మందు రెండు మిల్లీలు కలుపుకొని తర్వాత ఎం–45 మూడు గ్రాములతో శుద్ధి చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేస్తున్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి కృష్ణతేజ, సెరికల్చర్ అధికారి నాగేంద్ర, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ నిబంధన సడలించండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సర్వేయర్లు

కణేకల్లు: తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని విలేజ్ సర్వేయర్లు డిమాండ్ చేశారు. బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనలను సడలించాలని మండలంలోని విలేజ్ సర్వేయర్లు బుధవారం పెన్‌డౌన్ చేసి నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థాయి ఉద్యోగులైన తమకు సొంత మండలంలోనే పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఇంటి వద్దనే రేషన్ ఇవ్వాలి

బొమ్మనహాళ్: రేషన్ బియ్యాన్ని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే పంపిణీ చేయాలని తహసీల్దార్ మునివేలు రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వృద్ధులు, మంచానికి పరిమితమైన, దివ్యాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30లోపు ముందుగానే సచివాలయ సిబ్బందితో కలిసి రేషన్ సరుకులను ఇంటి వద్దనే అందించాలన్నారు.

కౌలు రైతులకు జొన్నలు ఇవ్వాలి

విడపనకల్లు: మండలంలోని కౌలు రైతులకు కూడా ఉచితంగా జొన్నలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు బోయ వెంకటేశులు, సీపీఎం నియోజకవర్గం ప్రాంతీయ పార్టీ నాయకులు రంగారెడ్డి, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మండలానికి ఉచిత విత్తన జొన్నలు ఎన్ని క్వింటాళ్లు కేటాయించిందో వ్యవసాయ అధికారులు చెప్పడం లేదన్నారు. కూటమి నాయకులు చెప్పిన వారికి మాత్రమే జొన్నలు ఇస్తున్నారని విమర్శించారు. జొన్నలు ఏ గ్రామంలోని రైతులకు పంపిణీ చేశారో కూడా తెలియదని వాపోయారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

వజ్రకరూరు: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనాబేగం, ఎస్‌ఐ నాగస్వామి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయస్సులో మత్తు పదార్థాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారం అవుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. ఉన్నతస్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఐసీపీఎస్ రమాదేవి, నోడల్ ఉపాధ్యాయురాలు సావిత్రి, పీడీ కళాసుధాకర్, ఈగల్ కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం నిర్మించాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రజల సౌకర్యార్థం పట్టణంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. బుధవారం ఆర్‌డీఓ వసంత్‌బాబుకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎస్సీ నియోజకవర్గంగా కొనసాగినప్పటికీ ఇక్కడ అంబేద్కర్ భవనం నిర్మించకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ భవనం ఏర్పాటుకు కోసం రూ 2కోట్లు కేటాయించిన నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. జేఏసీ నియోజవర్గ అధ్యక్షుడు చెలిమప్ప, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ

- ఇద్దరికి గాయాలు

ఉరవకొండ రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం ఉరవకొండ పట్టణంలోని అనంతపురం–బళ్లారి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఉరవకొండ పట్టణం వైపు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఉన్న ఫలంగా మలుపు తిరిగింది. వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న సంతోష్, అఫ్రిఫ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వీరిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆశా కార్యకర్త పోస్టు భర్తీకి చర్యలు

గుమ్మఘట్ట: కోనాపురంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ డే కమిటీ ద్వారా నియమించేలా జిల్లా అధికారులు సూచించారన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాల కోసం పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు.

జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని అక్కమ్మగార్ల కొండ వద్దనున్న ప్రభుత్వం భవనంలోకి మార్చాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఇన్‌చార్జ్ శివ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతమున్న అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతపురం రోడ్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతిగృహంలోకి మార్చాలని అధికారులను కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



అంజనమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉమా, నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ ఆంజనేయులు భార్య అంజనమ్మ(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు గ్రామానికి చేరుకుని అంజనమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబు, మండల కన్వీనర్ గోళ్ల సూరి, జిల్లా కార్యనిర్వహ కార్యదర్శి సత్తి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లప్ప, నాయకులు నరసింహులు, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

కుందుర్పి: కొలిమిపాళ్యం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత బడప్పగాని నరసింహప్ప(70)బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ గంగాధర, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు ఈ రాము, మాజీ వైస్ ఎంపీపీ రవి తదితరులు నరసింహప్పకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించాలరని నాయకులు రంగప్ప, మహేంద్ర, సురేష్ తదితరులు పేర్కొన్నారు.

క్రాప్ రుణాల రెన్యూవల్‌లో నిర్లక్ష్యం

విడపనకల్లు: మండల కేంద్రంలో కెనరా బ్యాంకు సిబ్బంది క్రాప్ రుణాల రెన్యూవల్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు నాగేంద్ర, నాగరాజు, మల్లికార్జున, సురేష్, రాముడు అంజినేయ, ఎర్రిస్వామి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రుణాల రెన్యూవల్ కోసం నెలల తరబడి బ్యాంక్ చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సరైన సమాధానం చెప్పకుండా రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. సకాలంలో రెన్యూవల్ చేయకపోతే వడ్డీ భారం మరింత పెరుగుతుందన్నారు. బ్యాంక్ అధికారుల తీరు మారకపోతే రైతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అధినేతతో మెట్టు విశ్వనాథరెడ్డి



రాయదుర్గటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు, నియోజకవర్గ యువనేత మెట్టు విశ్వనాథరెడ్డి కలిశారు.

‘అర్చకుల మధ్య విభేదాలు లేవు’

రాయదుర్గంటౌన్: అర్చకుల మధ్య ఎలాంటి విభేదాలూ లేవని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకర్ నారాయణశర్మ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం రాయదుర్గంలోని శ్రీ ప్రసన్న వేంటకరమణస్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వేంకటరమణస్వామి ఆలయ అర్చకత్వంపై తామంతా ఏకతాటిపై ఉన్నట్లు చెప్పారు. సంఘం కార్యవర్గసభ్యులు, పెద్దలు చర్చించి సమస్యను పరిష్కరించుకున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యమూ లేదని వివరించారు. కోర్టు ఉత్తర్వులతో అర్చకత్వాన్ని తీసుకున్న నరసింహమూర్తి మాట్లాడుతూ తాను స్వచ్ఛందంగా తప్పుకుంటున్నానని, తాళాలు దేవదాయ శాఖ ఈఓకు అప్పగిస్తానని చెప్పారు.

రసాయన మందుల వాడకంతో పర్యావరణానికి ముప్పు

ఉరవకొండ రూరల్: రసాయన మందుల వాడకం ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని ఏఓ రామకృష్ణుడు తెలిపారు. బుధవారం లత్తవరం, షేక్షానిపల్లి గ్రామాల పరిధిలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ, మొక్కజొన్న పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు నేటి నుంచి శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ధనుంజయనాథ్ బుధవారం తెలిపారు. మహిళ సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన సెల్‌ఫోన్ వెంట తెచ్చువాలని సూచించారు.

29న ఉచిత ‘ఫెర్టిలిటీ’ శిబిరం

ఉరవకొండ: అనంతపురానికి చెందిన జన్విత ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉరవకొండ పట్టణంలోని రామలింగ చౌడేశ్వరీ దేవి కళ్యాణ మండపంలో ఉచిత ‘ఫెర్టిలిటీ’ శిబిరం నిర్వహించనున్నారు. జన్విత సెంటర్ వైద్యాధికారి డాక్టర్ భారతి ఆధ్వర్యంలో జరగనున్న శిబిరానికి సంతానం లేని దంపతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 81214 49988 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.